

హత్నూర: మహిళలతో ముచ్చటిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి



హత్నూర:ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, అభ్యర్థి సునీతారెడ్డి

# ఆడబిడ్డగా వస్తున్నా.. ఆశీర్వదించండి

**• గతంలో ఎంతో అభివృద్ధి చేశా.. మరో అవకాశం ఇవ్వండి • బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి**

హత్నూర, నవంబర్ 6: ఆడబిడ్డగా మీముందుకు వస్తున్నా మీమంచి మనస్సుతో ఆశీర్వదించాలని నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం హత్నూర మండలం దేవునిగుడితండా, తెల్లరాళ్లతండా, గోవిందరాజ్‌పల్లి, లింగాపూర్, చీక్‌మద్దూర్, కొన్యాల, పన్యాల, మాధుర గ్రామాల్లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ గతంలో నియోజకవర్గప్రజలు ఎమ్మెల్యేగా భారీమెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే.. నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధిచేశానని గుర్తుచేశారు. ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినవెంటనే అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలుచేయనున్నట్లు తెలిపారు. బూత్ స్థాయి నాయకులు ప్రతి ఓటరును కలిసి బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటు వేయాలో వివరించాలన్నారు. ప్రతిపక్షాల అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలని సూచించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు మేలు చేయలేన్నోళ్లు ఇప్పుడు కొత్తగా గ్యారెంటీ, వారంటీ అంటూ వస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలు వచ్చినప్పుడే కాంగ్రెస్, బీజేపీ నేతలకు ప్రజలు గుర్తుకువస్తారని ఆరోపించారు.

**కాంగ్రెస్ మాటలు నమ్మొద్దు: ఎమ్మెల్యే మదన్‌రెడ్డి**

ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓట్ల కోసం కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మొద్దని, అలాంటి వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తెలిపారు. పనిచేసే పార్టీకి పట్టంకట్టి అభివృద్ధిని సాధించుకోవాలన్నారు. నేడు సీఎం కేసీఆర్‌ను దేశం మొత్తం విజన్ ఉన్న నాయకుడని కొనియాడుతున్నారని తెలిపారు. అంతకుముందు సిరిపుర మాతామానికేశ్వరి ఆలయంలో ప్రత్యేకపూజలు చేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఆంజనేయులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నర్సింహరెడ్డి, రాజేందర్, వీరస్వామిగౌడ్, శ్రీకాంత్, రవి, విఠల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, నరేందర్, శ్రీనివాస్‌గౌడ్, వీరేశంగౌడ్, సుధాకర్, అర్జున్, రవీందర్‌నాయక్, వీరేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



చల్మెడలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న గ్రామ శాఖ అధ్యక్షుడు రాగుల బాబు

## పార్టీ పటిష్టతకు కార్యకర్తలు పని చేయాలి

నిజాంపేట, నవంబర్6:మండలంలోని చల్మెడలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాగుల బాబు మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డితో కలిసి సోమవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్ భాస్కర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం పాటుపడే ఒకే ఒక పార్టీ బీఆర్ఎస్ అని, పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో తిరుమలస్వామి ఆలయ చైర్మన్ అకుల మహేందర్, ఎంపీటీసీ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాళం కృష్ణాగౌడ్, రైతుబంధు సమితి గ్రామ అధ్యక్షుడు లక్ష్మీనారయణ, గ్రామస్తులు రామాగౌడ్, తిరుపతిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మల్లయ్య, స్వామి, రమేశ్ పాల్గొన్నారు.



కొల్చారం పాఠశాల ఉపాధ్యాయురాలికి సూచనలిస్తున్న డీఈవో

## టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

కొల్చారం, నవంబర్ 6: పదో తరగతి విద్యార్థులు మంచి జీపీఏ సాధించే దిశగా ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుంచి (మంగళవారం) ఒక్కపూట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. కొల్చారం మండల పరిదిలోని పోతంశెట్‌పల్లి, వరిగుంతం, కొల్చారం గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఏఎంవో సుదర్శన్‌మూర్తితో కలిసి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి విద్యార్థులకు మంగళవారం నుంచి ఒక్కపూట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, తదుపరి రెండు పూటల ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు.

## నేడు చిలిపిచెడ్‌లో బీఆర్ఎస్ ప్రచారం

చిలిపిచెడ్, నవంబర్ 6:చిలిపిచెడ్ మండలంలో మంగళవారం బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నామని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పట్లోళ్ల అశోక్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చిట్కుల్, బద్రియతండా, గుజిరితండా, గన్యతండా, టోప్యతండా, చండూరు, గౌతాపూర్, చిలిపిచెడ్, శిలాంపల్లి, సోమక్కపేట, రాందాసుపల్లి గ్రామాల్లో నిర్వహించే ప్రచారానికి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి హాజరుకానున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

శివ్వంపేట, నవంబర్ 6: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రవికాంత్‌రావు కథనం ప్రకారం శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన పంపరి స్వామి (30) ఆదివారం శివ్వంపేటలోని తన బంధువుల ఇంటికి వచ్చి సోమవారం ఉదయం 4:30 గంటల ప్రాంతంలో స్వగ్రామానికి వెళ్తుండగా శివ్వంపేటలోని భారత్ గ్యాస్ గోదాం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొని తీవ్ర గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటినా నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్సకోసం గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగా స్వామి మార్గమధ్యలో మృతిచెందినట్టు ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.



## నర్సాపూర్‌కు తరలిన గొల్ల కురుమలు

చిలిపిచెడ్, నవంబర్ 6: నర్సాపూర్ పట్టణంలో నిర్వహించిన 'గొల్ల కురుమల ఆత్మీయ సమ్మేళనానికి' సోమవారం చిలిపిచెడ్ మండలం అజ్జమర్రి సర్పంచ్ పరశురాంరెడ్డి, ఆత్మకమిటీ డైరెక్టర్ వీరస్వామి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సమ్మేళనానికి ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం హాజరయ్యారు.

## జోరుగా బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

వెల్దుర్తి, నవంబర్ 6: వెల్దుర్తి, మాసాయిపేట మండలాల పరిధిలో బీఆర్ఎస్ నాయకులు గ్రామాల్లో పర్యటిస్తూ జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రతి గడపగడపకూ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ, గత సమైక్య పాలన, ప్రస్తుత పాలనపై వారికి అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం వెల్దుర్తి మండల పరిధిలోని యశ్వంతరావుపేట, మంగళపర్తి, మానేపల్లి, జలాల్‌పూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, జడ్పీటీసీ రమేశ్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తూ, కారు గుర్తుకు ఓటువేసి బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతున్నారు.

☛ మండల మాసాయిపేట మాజీ సర్పంచ్ నాగరాజు, నాయకులు వపన్, రాము, దుర్గపతిల ఆధ్వర్యంలో మాసాయిపేట గ్రామానికి చెందిన పలు పార్టీలకు చెందిన నాయకులు, యువకులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరగా బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు.



అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న మాసాయిపేట మండల నాయకులు



బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి

## సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరిక

చిలిపిచెడ్, నవంబర్ 6: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం చిలిపిచెడ్ మండలంలోని పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డిల సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బీజేపీ మండల ఉపాధ్యాక్షుడు కురిగల్ల ప్రశాంత్, మన్నె మహేశ్, కృష్ణ, సంగమేశ్, ఎరుకల రవీందర్, బొగ్గుల శ్రీధర్, మహేశ్, లింగం, పోచయ్య, సాయికుమార్, కుమ్మరి కృష్ణ, స్వామి, వినోద్, బండల మహేశ్, ఎర్రోళ్ల సాయికుమార్ తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పట్లోళ్ల అశోక్‌రెడ్డి, సీనియర్ నాయకులు పోచయ్య, అనంత రామాగౌడ్ తదితరులు ఉన్నారు.

## బీ ఫామ్ ఇవ్వకున్నా 8న నామినేషన్ వేస్తా..

**• కాంగ్రెస్ అసమ్మతి నాయకుడు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్**

నర్సాపూర్, నవంబర్6: కాంగ్రెస్ అధిష్టానం బీ ఫామ్ ఇవ్వకున్నా 8వ తేదీన నామినేషన్ వేస్తానని కాంగ్రెస్ అసమ్మతి నాయకుడు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆవుల రాజిరెడ్డికి అధిష్టానం బీ ఫామ్ అందజేసింది. ఈ సందర్భంగా నర్సాపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అనిల్‌కుమార్ విలేఖరులతో మాట్లాడారు. తనకు టికెట్ కేటాయించకపోవడం దురదృష్టకరమని, ఇప్పటి వరకు కాంగ్రెస్ మండల స్థాయి నాయకులను సంప్రదించలేదని, రాజిరెడ్డి గెలవాలనుకుంటే అందరిని కలుపుకొని పోవాలని సూచించారు. 8వ తేదీన నామినేషన్ వేస్తానని, పార్టీ నాకు బీ ఫామ్, ఏ ఫామ్ ఇస్తుందనే నమ్మకం ఉందని వెల్లడించారు. ఇదిలా ఉంటే అసంతృప్తి నాయకుడు గాలి అనిల్‌కుమార్‌కు బీ ఫామ్ ఇచ్చే ఆలోచనలో పార్టీ అధిష్టానం సిద్ధంగా ఉందని కాంగ్రెస్ శిబిరంలో నాయకులు చర్చించుకున్నారు. ఆవుల రాజిరెడ్డికి బీఫామ్ మాత్రమే ఇచ్చారని, ఏ ఫామ్ ఇంకా ఇవ్వలేదని చర్చించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులుగౌడ్, రవీందర్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, రజాక్, సురేశ్‌నాయక్, శ్రీనివాస్‌గుప్తా, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



విలేకరులు సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్